క్లుప్తంగా

పరామర్శ



నరసింహులును పరామర్శిస్తున్న ఆకేపాటి

నందలూరు : కోనాపురం మాజీ సర్పంచ్ తోడేటి నరసింహులు హార్ట్ ఆపరేషన్ చేసుకున్న విషయం తెలుసుకొన్న జిల్లా పరిషత్ చైర్మన్, రాజంపేట వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి శుక్రవారం నరసింహులు ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని నరసింహులకు అమర్నాథ రెడ్డి చెప్పారు. ఆయన వెంట గడికోట వెంకటసుబ్బారెడ్డి, బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు భాస్కర్ యాదవ్, నందలూరు ఉప సర్పంచ్ ఇబ్బు, ఆనాల మధు యాదవ్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో వెలసిన శ్రీపర్వతగిరి దక్షిణముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం నుంచి 11వ వార్షికోత్సవ పూజలు జరుపనున్నట్లు ఆలయ ధర్మకర్త లక్షుమయ్య తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ శ్రీ పర్వతగిరి దక్షిణముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి గణపతిపూజ, పుణ్యాహవాచనం, ఆకుపూజ, అర్చనలు, మంగళహారతులు, మంత్రపుష్పం తీర్థ ప్రసాదాల వినియోగం వంటి పూజా కార్యక్రమాలు చేస్తామన్నారు. కావున భక్తులు స్వామి వారిని దర్శించుకొని ఆయన కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ఘనంగా ప్రారంభమైన జాతర

సుండుపల్లె : మండల కేంద్రంలోని గంగిరెడ్డిగారిపల్లెలో వెలసిన దండువారమ్మ జాతరను పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిపూలు, పట్టువస్త్రాలు బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం ఉదయం అభిషేకం, అర్చనలు, పూజలు చేసి ఆదివారం రోజున రాత్రికి చెక్కభజనలు, కోలాటాలతో చాందినీ బండ్లు తిరుగుతాయన్నారు. భక్తులు బోనాలు సమర్పించి అమ్మవారికి మొక్కలు చెల్లించుకుంటారన్నారు.

ఆడపూరులో ఇంటింటి సర్వే

నందలూరు : ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను ఇంటికి పరిమితం కాకుండా వారిలో మానసిక, శారీరకంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో పాఠశాలల్లో చేర్పించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని మండల సమ్మిళిత ఉపాధ్యాయులు రంగస్వామి తెలిపారు. శుక్రవారం దివ్యాంగ పిల్లల గుర్తింపు కోసం ఆడపూరులో సర్వేను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్ రెడ్డి, సమ్మిళిత విద్య సమన్వయ కర్త జనార్దన్ ఆదేశాల మేరకు సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు 15 మంది పాఠశాలలోని లేని పిల్లలను గుర్తించామన్నారు. వీరిని పాఠశాలలో చేర్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వారికి ఉపకరణాలు, ఉపకార వేతనాలు, చిన్నపాటి శస్త్రచికిత్సలు, రవాణా భత్యం, ఎస్కార్ట్ అలవెన్సుల కింద రూ. 300లు, బాలికలకు ప్రత్యేకంగా రూ. 200లు, వినికిడి, దృష్టి లోపం ఉన్న పిల్లలకు ట్యాబులు, స్పీచ్‌థెరఫీ, ఫిజియోథెరఫీ, శిక్షణ ఇలాంటి సదుపాయాలన్నీ కల్పిస్తామని తల్లిదండ్రులకు తెలియజేశారు.

హనుమజ్జయంతికి ఏర్పాట్లు

పుల్లంపేట : నేడు శనివారం హనుమజ్జయంతి సందర్భంగా మండల పరిధిలోని పుల్లంపేట, దళవాయిపల్లి, అనంతంపల్లి, రెడ్డిపల్లె తదితర ప్రాంతాలలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆంజనేయస్వామి ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. స్వామివారి ప్రత్యేక పూజా కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకోనున్నారు. అలాగే పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.

పొగాకు వాడకం ప్రాణాంతకం

సుండుపల్లె : ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శేఖర్‌రెడ్డి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు తాగడం వలన క్యాన్సర్, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. కావున ఎవరూ పొగాకు ఉత్పత్తులైన చుట్ట, బీడీ, సిగరెట్, గుట్కా, పాన్ మసాలాలు వాడకూడదన్నారు. వాటిని సేవించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని తెలియజేశారు.

దర్గాలో ఎమ్మెల్యే ప్రార్థనలు

రాయచోటి(అన్నమయ్య సర్కిల్) : నియోజకవర్గంలోని ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్థానిక మసీదులు, దర్గాలలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ప్రార్థనలు నిర్వహించారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని బంగ్లా సమీపంలో ఉన్న చున్నా మసీదులో జుమ్మా నమాజ్ ప్రార్థనలు, ఈద్గా సమీపంలో ఉన్న హజరత్ జమాలుల్లాబాషా దర్గాలో మైనార్టీ సోదరులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, మత సామరస్యం వెల్లివిరియాలని శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫయాజ్‌బాషా, మహమ్మద్‌ఖాన్, జాకీర్, చాన్‌బాషా, రౌనక్ తదితరులన్నారు.

ఓట్ల లెక్కింపులో సూపర్‌వైజర్ల పాత్ర కీలకం

– రైల్వేకోడూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి లీలారాణి



మాక్ కౌంటింగ్ శిక్షణలో మాట్లాడుతున్న కోడూరు ఆర్‌ఓ లీలారాణి

రాయచోటి : ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కౌంటింగ్ సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని రైల్వేకోడూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి లీలారాణి పేర్కొన్నారు. శుక్రవారం రాయచచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఓట్ల లెక్కింపుపై రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల కౌంటింగ్ సిబ్బందికి (మాక్ కౌంటింగ్ శిక్షణ) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి లీలారాణి మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు–2024కు సంబంధించి అన్నమయ్య జిల్లాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించేందుకు కౌంటింగ్ సిబ్బంది అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు కౌంటింగ్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఎవరు సొంత నిర్ణయాలు తీసుకోకూడదన్నారు. ఓట్ల లెక్కింపులో ఏవైనా అనుమానాలు ఉంటే క్లియర్ చేసుకోవాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో ఏ సమస్య వచ్చినా వెంటనే ఆర్‌ఓకు తెలియజేయాలన్నారు. ఓట్లు లెక్కింపు సమయంలో ఈవీఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే అందుబాటులో ఉన్న బెల్ కంపెనీ ఇంజనీర్లకు తెలియజేయాలన్నారు. రాయచోటిలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే ఓట్ల లెక్కింపునకు సంబంధించి జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 12 కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఫారం 13ఏ, 13బీ, 13సీ, 17సీకి సంబంధించిన ఫామ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణా కార్యక్రమాల నోడల్ అధికారులు, డీపీఓ ధనలక్ష్మీ, ఎలక్షన్ సెల్ సూపరిటెండెంట్ నరసింహకుమార్, కౌంటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపింగ్ యార్డ్ పరిశీలన



ఇసుక డంపింగ్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈబీ ఎస్‌ఐ బాబు, రెవెన్యూ అధికారులు

సిద్దవటం : ఎన్‌ఫోర్స్‌మెంటు జిల్లా అదనపు ఎస్పీ వెంకటరాముడు ఆదేశాల మేరకు సిద్దవటం మండలంలోని జ్యోతి గ్రామ పంచాయతీ ప్రాంతాల్లో ఇసుక నిల్వ చేసిన డంపింగ్ ప్రాంతాన్ని శుక్రవారం సిద్దవటం ఎస్‌ఈబీ ఎస్‌ఐ వై.బాబు, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ బాబు మాట్లాడుతూ జ్యోతి ఇసుక రవాణా డంపింగ్‌కు ప్రభుత్వ అనుమతి 27 ఫిబ్రవరి 2024 తేదీన మంజూరు చేసిందన్నారు. ఇసుక తరలింపు ప్రక్రియ ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రభుత్వం నిర్దేశించబడిన ప్రదేశాలకు మాత్రమే అనుమతి ఉందన్నారు. ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా ఇసుక అమ్మకం నిషేదమన్నారు. ఇసుక డంపింగ్ నిల్వల కాల పరిమితి ముగింపు తేదీ మైనింగ్ శాఖ అధికారుల దగ్గర ఉంటాయని ఆయన అన్నారు. 1.59 వేల మెట్రిక్ టన్నుల ఇసుక తోలుకోవడానికి మాత్రమే అనుమతులున్నాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు మాధవీలత, ఆర్‌ఐ అనూరాధ, వీఆర్‌ఓ శ్యాంబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే సహించం

– ప్రజలకు అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్

– విజయోత్సవ సభలకు, ర్యాలీలకు అనుమతులు లేవు



అల్లరి మూకలను అదుపులోకి తీసుకొచ్చే ప్రక్రియలో భాగంగా మాక్ డ్రిల్ చేస్తున్న పోలీసులు

రాయచోటి టౌన్ : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్, కౌంటింగ్ పూర్తయిన తరువాత ఎవరూ విజయోత్సవ సభలు, ర్యాలీలు నిర్వహించకూడదని వీటిని నిషేధించామని రాయచోటి డీఎస్పీ రామచంద్రరావు ప్రజలకు సూచించారు. ఒకవేళ చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించమని చెప్పారు. శుక్రవారం రాత్రి బంగ్లా సర్కిల్ వద్ద మాబ్ అపరేషన్, మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లర్లకు పాల్పడిన వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటామనే విధంగా అవగాహన కల్పించేందుకు ప్రజలతో రోడ్డుపై ప్రయోగాత్మకంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించినా, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమల్లో ఉంటుందని తెలిపారు. అలాగే సెక్షన్ 144తోపాటు పోలీస్ 30 అమల్లో ఉంటుందని చెప్పారు. ఇలాంటి సమయంలో రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లను బైండోవర్ చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా నాకాబందీలు, కార్డెన్ అండ్ సెర్చ్ అపరేషన్లు, ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. అనుకోని సంఘటనలు జరిగితే వాటిని అదుపులోకి తెచ్చేందుకు అవసరం అయితే బాష్పాయువు ప్రయోగించడం, వాటర్ కెనాన్ చేయడం అప్పటికీ అదుపులోకి రాకపోతే లాఠీచార్జ్, ప్లాస్టిక్ బుల్లెట్‌తో ఫైరింగ్ చేస్తాం.. అప్పటికీ అదుపులోకి రాకపోతే ఉన్నతాధికారల ఆదేశాలతో ఫైరింగ్ చేస్తామని తెలియజేశారు.

విజయోత్సవ ర్యాలీలకు అనుమతుల్లేవు



వీరబల్లె: మాట్లాడుతున్న రాయచోటి డీఎస్పీ రామచంద్రరావు



పుల్లంపేట: మాట్లాడుతున్న ఎన్నికల స్పెషల్ డీఎస్పీ బాపూజీ

పుల్లంపేట : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ వేళ విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు లేవని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాజంపేట ఎన్నికల డీఎస్పీ బాపూజీ అన్నారు. శుక్రవారం పుల్లంపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 6వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. ఎవరైనా పాత నేరస్తులను ఆశ్రయిస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కావున ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాజంపేట సీఐ మంజునాథ రెడ్డి, పుల్లంపేట ఎస్‌ఐ రఘురాం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రంలో ఏజెంట్లకు మాత్రమే అనుమతి

గాలివీడు : కౌంటింగ్ రోజు ఏజెంట్లకు తప్ప మిగిలిన వారికి అనుమతి లేదని, ఇతరులెవరూ కౌంటింగ్ కేంద్రం వద్దకు రావద్దని లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్ గంగానాథబాబు సూచించారు. శుక్రవారం స్థానిక ఎస్‌ఐ వెంకటప్రసాద్‌తో కలిసి పోలీస్‌స్టేషన్ ఆవరణలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జూన్ 4వ తేదీ ఎన్నికల ఫలితాల సందర్భంగా జిల్లా కేంద్రం రాయచోటిలో కౌంటింగ్ కేంద్రం 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అనవసరంగా అక్కడికి వచ్చి ఇబ్బందులకు గురికావద్దన్నారు. అంతేగాక సమూహాలుగా ఎవ్వరూ గుమికూడవద్దన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు ఎలాంటి అనుమతులు లేవని గుర్తుకు చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

నందలూరు : సార్వత్రిక ఎన్నికల ఫలితాల రోజున ఎటువంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని సీఐ మంజునాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఎస్‌ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ టపాసులు పేల్చినా, ర్యాలీలు నిర్వహించినా అట్టివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫలితాల రోజున రాజకీయ పార్టీల నేతలు సంయమనం పాటించాలని తెలిపారు. 30 యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాముడు, హెడ్ కానిస్టేబుళ్లు పరమేష్, గోపాల్, సుబ్బరాయుడు, మహేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్ రోజున 144 సెక్షన్

పెనగలూరు (ఓబులవారిపల్లె): మే నెల 13వ తేదీన జరిగిన ఎన్నికలలో ఓటింగ్‌కు జూన్ నెల 4వ తేదీన జరుగుతుందని, కావున జూన్ 4న మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉండటంతోపాటు పోలీస్ సెక్షన్ 30 కూడా అమలులో ఉంటుందన్నారు. కావున నలుగురు కంటే ఎక్కువగా జనాభా ఉండకూడదన్నారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం ప్రజలకు 144 సెక్షన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు.

సిద్దవటంలో గ్రామసభ

సిద్దవటం : జూన్ 4వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మండలంలోని ఏ గ్రామంలోనైనా ఘర్షణలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని సిద్దవటం ఎస్‌ఐ పెద్ద ఓబన్న హెచ్చరించారు. మండలంలోని భాకరాపేట, సిద్దవటం గ్రామాల్లో శుక్రవారం విజిబుల్ పోలీసింగ్, గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నదే తమ ఉద్దేశమన్నారు. ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా ఉండేందుకు పోలీసులు అండగా ఉన్నామన్నామంటూ భరోసా కల్పించేలా గ్రామాల్లో కవాతు నిర్వహించడం జరిగిందన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే..

వీరబల్లె : ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో ఎన్నికల కోడ్ కొనసాగుతోందని, అదే విధంగా ఎన్నికల కౌంటింగ్ సమయం దగ్గర పడుతున్న తరుణంలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ రామచంద్రరావు తెలిపారు. శుక్రవారం వీరబల్లె, సుండుపల్లె మండలాలకు సంబంధించి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సానేపాయ ఉన్నత పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి నుండి ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేంతవరకు ఎవరైనా అల్లర్లకు గానీ, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. టపాసులు పేల్చడం, ర్యాలీలు చేయడం, సభలు, సమావేశాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపట్టకూడదన్నారు. ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ ముగిసేలాగా అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ తులసీరాం, వీరబల్లి ఎస్‌ఐ చంద్రమోహన్, సుండుపల్లె ఎస్‌ఐ షేక్ హుస్సేన్, పోలీసు సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న సిబ్బంది

సుండుపల్లె : మండల పరిధిలోని జీకే రాచపల్లి హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న మహబూబ్ బాషా పదవీ విరమణ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుమలత శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 36 సంవత్సరాల నుంచి విద్యార్థుల అభివృద్ధికి, పాఠశాల అభివృద్ధి కోసం మహబూబ్ బాషా చేసిన కృషిని కొనియాడారు. తదనంతరం ఆయన్ను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు చెంగల్ రాయుడు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు పంపిణీ



చిన్నమండెం: వేరుశనగ విత్తనకాయల ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న జేడీ చంద్రనాయక్

సుండుపల్లె : ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ ఎర్ర వేరుశనగ విత్తనకాయలను ఒక బస్తా (30 కేజీలు) ధర రూ. 1746లో సుండుపల్లె–2 సచివాలయ రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు హార్టికల్చర్ అసిస్టెంట్ మల్లికార్జున అందజేశారు. రిజిస్ట్రేషన్ చేసుకోకున్న రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్‌లు, ఫోన్ నెంబరుతో రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఉపయోగపడే ఎరువులు, పొటాష్, యూరియా అందుబాటులో ఉన్నాయన్నారు. ఒక బస్తా పొటాష్ (50 కేజీలు) ధర రూ. 1653లు, యూరియా ఒక బస్తా (50 కేజీలు) ధర రూ. 266లుగా నిర్ణయించారన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోండి

రామాపురం : రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వేరువనగ విత్తనకాయలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చిట్లూరు, నల్లగుట్టపల్లె రైతు భరోసా కేంద్రాలను ఆయన తనిఖీ చేపట్టారు. మాట్లాడుతూ విత్తనకాయలను తీసుకున్న ప్రతి రైతు ఈ పంట నమోదు చేయించాలని, ఈ పంట నమోదు చేయించని వారి నుండి విత్తనకాయ ధరను రికవరీ చేయబడుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమణి, మండల రైతు సలహా మండలి చైర్మన్ అయోధ్యరెడ్డి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ పరిశీలన

చిన్నమండెం : మండల పరిధిలోని దిగువగొట్టివీడు గ్రామ రైతు భరోసా కేంద్రంలో రైతులకు పంపిణీ చేస్తున్న విత్తనకాయల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టాదారు పాసు పుస్తకం కలిగిన రైతులు స్థానిక ఆర్బీకేలో పేరు నమోదు చేసుకొని రాయితీ విత్తనకాయల ప్యాకెట్‌ను తీసుకోవచ్చన్నారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఉత్కంఠ భరితంగా నందలూరు క్రికెట్ టోర్నీ

నందలూరు : నందలూరు ప్రీమియర్ లీగ్ ఉత్కంఠ భరితంగా సాగుతోంది. నాగిరెడ్డిపల్లె పంచాయతీ అరవపల్లెలోని జెడ్పీహెచ్‌ఎస్ క్రీడా మైదానంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం మ్యాచ్‌లో రైజింగ్ స్టార్ అరవపల్లె జట్టు, వినాయక లెవెన్స్ నాగిరెడ్డిపల్లె జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన రైజింగ్ స్టార్ జట్టు 14 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసింది. హరి 30, గజాయ్ 36, మహేష్ 28 పరుగులతో రాణించారు. అనంతరం ఛేజింగ్‌కు దిగిన సీతాపురం జట్టు 10.2 ఓవర్లలో 57 పరుగులకు ఆలౌట్ అయ్యింది. రైజింగ్ స్టార్ జట్టు బౌలర్ మహేష్ మూడు ఓవర్లు వేసి మూడు వికెట్లు తీయడంతోపాటు 28 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

మునక్కాయలపల్లె జట్టుపై కింగ్స్ డాబా జట్టు విజయం

మధ్యాహ్నం మునక్కాయలపల్లె, కింగ్స్ డాబా మంటపంపల్లె లెవన్స్ జట్ల మధ్య మ్యాచ్ ఉత్కంఠ భరితంగా కొనసాగింది. మొదట బ్యాటింగ్ చేసిన మునక్కాయలపల్లె 14 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. గంగయ్య 43 పరుగులు, అశోక్ 33 పరుగులు చేశారు. అనంతరం 120 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన కింక్స్ డాబా జట్టు 13.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సాధించింది. కేశవ 45, అఖిల్ 26 పరుగులతో మెరిశారు. 4 ఓవర్లు వేసి మూడు వికెట్లు తీసిన వెంకట వంశీ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీని అందుకున్నాడు.

విధి నిర్వహణలో మీ సేవలు ఎంతో అమూల్యం



ప్రతాప్ రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే తదితరులు



సంబేపల్లె: రహ్మతుల్లాను సన్మానిస్తున్న దృశ్యం



ఎస్‌ఐ జయరాంను సన్మానిస్తున్న అదనపు ఎస్పీ



సుండుపల్లె: వీఆర్‌ఓ దంపతులను సన్మానిస్తున్న..

లక్కిరెడ్డిపల్లె : ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఎస్‌లో ఏఈగా పనిచేస్తూ పదవీ విరమణ పొందుతున్న ప్రతాప్ రెడ్డి సేవలు మరువలేనివని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని స్థానిక పీజీఆర్ కల్యాణ మండపంలో ప్రతాప్ రెడ్డి పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవీ విరమణ అనేది ఒకింత భావోద్వేగపరిచే విషయమన్నారు. శేష జీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని కోరారు.

రహ్మతుల్లా సేవలు మరువలేనివి

సంబేపల్లె : దేవపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందుతున్న రహ్మతుల్లా సేవలు మరువలేనివని ఆ పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శుక్రవారం దేవపట్లలో ఆయనకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

సిద్దవటం : ప్రభుత్వం ఉద్యోగంలో చేరిన ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ అనేది తప్పనిసరిగా ఉంటుందని సిద్దవటం ఎంఈఓ–2 అరుణ తెలిపారు. మండల కేంద్రంలోని మండల విద్యాశాఖ వనరుల కేంద్రంలో శుక్రవారం ఎంఈఓ శంకరయ్య పదవీ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ–2 అరుణ మాట్లాడుతూ ఎంఈఓ శంకరయ్య మండలానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. అనంతరం ఎంఈఓ శంకరయ్యను పూలమాలలతో శాలువాలు కప్పి మెమెంటోలను ఇచ్చి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అట్లూరు ఎంఈఓ విలియంరాజు, బి.కోడూరు ఎంఈఓ–2 సునీల్, జాఫర్, లక్ష్మికేశమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పథకాలను చేరువ చేశాడు

రాయచోటి(వ్యవసాయం) : ప్రభుత్వ పథకాలను అర్హత కలిగిన విద్యార్థులందరికీ చేరువ చేయించి అందరి మన్ననలను పొందారని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి జిల్లా విద్యాశాఖలో పథకాల సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న నరసింహులును అభినందించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పథకాల సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న నరసింహులు శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా డీఈఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో నరసింహులు, ఆయన సతీమణిని విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

ఘనంగా వీడ్కోలు

లక్కిరెడ్డిపల్లె : ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని ఎంఈఓ చక్రే నాయక్ పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లె ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఫిరోజ్ అలీఖాన్ శుక్రవారం పదవీ విరమణ పొందారు. వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిరోజ్ అలీఖాన్ చేసిన సేవలను కొనియాడి, ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఆపస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలకు దగ్గరగా ఉండేది పోలీసులు మాత్రమే

రాయచోటి రూరల్ : ప్రజాసేవ చేయడంలో ప్రజలకు దగ్గరగా ఉండేది పోలీసులు మాత్రమేనని అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్ అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణ కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్‌ఐ జయరాం పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ప్రపంచంలో ఎన్నో వృత్తులు ఉన్నాయని, అన్నింటికన్నా ముందుండి ప్రజాసేవ చేసేది ఒక పోలీస్ ఉద్యోగం మాత్రమే అన్నారు. ఎస్‌ఐ జయరాం పోలీస్ శాఖకు చేసిన సేవలను ఆయన కొనియాడారు.

వీఆర్‌ఓ పదవీ విరమణ

సుండుపల్లె : భాగంపల్లిలో వీఆర్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న ఎన్.వేదనాయకానికి శుక్రవారం ఘనంగా పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని మండల రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది వీఆర్‌ఓ వేదనాయకం, ఆయన సతీమణి జయమ్మలను సత్కరించారు.



ఫిరోజ్ అలీఖాన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



నరసింహులును సన్మానిస్తున్న డీఈఓ, అధికారులు



ఎంఈఓ శంకరయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పోషకాహారాన్ని అందించాలి

లక్కిరెడ్డిపల్లె : పాఠశాలలోని విద్యార్థులకు మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని మండల విద్యాశాఖ అధికారి–2 వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో మండలంలోని వంట ఏజన్సీలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సిబ్బందికి పలు సూచనలు అనంతరం వంట పోటీలలో నిర్వహించి బహుమతులు అందజేశారు.

సర్టిఫికెట్ల ప్రదానం

ఓబులవారిపల్లె : చిన్మయారణ్యం ఆశ్రమంలో బాలవిహార్ విద్యార్థులకు తొమ్మిదిరోజులపాటు జరిగిన వేసవి కార్యక్రమాలను శుక్రవారం ముగించారు. ఆశ్రమ నిర్వాహకులు శీలానంద, శ్రేయానందల ఆధ్వర్యంలో రామ ది సింబల్ ఆఫ్ ధర్మ అనే పేరుతో విద్యార్థులకు తొమ్మిది రోజులపాటు బాలవిహార్ సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. విద్యార్థులకు సూర్య నమస్కారాలు, వేదపఠనం, భగవద్గీత పారాయణం, చిత్రలేఖనం, భజనలు నేర్పించారు. శుక్రవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో జి.వెంకటరమణ పాల్గొని శ్రీరాముడు అనే అంశంపై ఉపన్యాసం చేశారు.